పెందుర్తిలో ఫ్యాన్ జోరు

ప్రజా సేవకుడెవరు..ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వారెవరు అన్న ప్రశ్న వస్తే పెందుర్తి నియోజకవర్గ ప్రజల వద్ద జవాబు ఉంది. ప్రజా సేవ విషయంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కే మార్కులు పడుతున్నాయి. అదీప్‌రాజ్ ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు నియోజకవర్గ వాసులకు సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో నేనున్నానంటూ ప్రజలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ భరోసా కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారు.

ప్రజల మనిషి అదీప్‌రాజ్


అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

ప్రజలకు ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకునే వ్యక్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి దాదాపు 30 వేల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అదీప్‌రాజ్ ప్రజలకు మరింత చేరువయ్యారు.

- అదీప్‌రాజ్ చొరవతో నియోజకవర్గంలో 33 వేల మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయించారు.
- ముఖ్యంగా కోవిడ్ వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని సమయంలో నియోజకవర్గంలోని నిరుపేదలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అండగా నిలిచారు. తన సొంత నిధులు రూ.2 కోట్లకు పైగా వెచ్చించి నిరుపేదలకు నిత్యావసరాలు, మందులు అందించారు. అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి కోవిడ్ బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

అభివృద్ధిలో అదీప్ మార్క్

- గడపగడపకూ మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల ద్వారా ప్రతీ గడపనూ రెండు మూడు సార్లు సందర్శించి ప్రజలతో అదీప్‌రాజ్ మమేకమయ్యారు.
- రూ.14 కోట్లతో పెందుర్తి–సబ్బవరం రహదారి నిర్మాణం చేపట్టారు.
- బీఆర్‌టీఎస్ రహదారి నుంచి సుజాతనగర్ సీ–2 జోన్ పార్కు వరకు రూ.2.99 కోట్లతో రహదారి నిర్మించారు.
- పెందుర్తి–పులగానివానిపాలెం రోడ్డును రూ.1.98 కోట్లతో నిర్మించారు.
- జీవీఎంసీ విలీన ప్రాంతాల్లో పార్కులను రూ.20 కోట్లతో అభివృద్ధి చేశారు.
- సబ్బవరంలోని ప్రతిష్టాత్మక పెట్రో యూనివర్సిటీ వేరే ప్రాంతానికి తరలిపోతుందన్న సమయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ న్యాయపరంగా యూనివర్సిటీ ఇక్కడే ఉండేలా కృషి చేశారు.
- పరవాడ–భర్నికం రహదారి నిర్మాణం కోసం రూ.60 లక్షలు, పరవాడ–తానాం–ఎస్‌హెచ్–5 రహదారి నిర్మాణం రూ.2 కోట్లు, విసన్నపేట–వాడచీపురుపల్లి రోడ్డు నిర్మాణం కోసం రూ.1.80 కోట్లు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టారు.
- పరవాడ జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలోని మినీ స్టేడియం కోసం రూ.2 కోట్లు నిధులు తీసుకువచ్చి దాన్ని పూర్తి చేశారు.
- పాలనాపరంగా..వ్యక్తిత్వం పరంగా ఎమ్మెల్యే అదీప్‌రాజే పెందుర్తి ప్రజలకు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నారు.

వలస పక్షి పంచకర్ల


పంచకర్ల రమేష్‌బాబు జనసేన అభ్యర్థి

పదవుల కోసం పాకులాడే వ్యక్తి పంచకర్ల రమేష్‌బాబు అని జిల్లాలో నానుడి. పదవి కోసం కనీస విలువలు పాటించకుండా చొక్కా మార్చినంత సులువుగా పార్టీలు మార్చేస్తుంటారు. 2009లో రమేష్‌బాబు ప్రజారాజ్యం తరఫున పెందుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొంతకాలానికే ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో పంచకర్ల అధికార(కాంగ్రెస్) పార్టీ ఎమ్మెల్యేగా అవతారం ఎత్తారు. అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న పెందుర్తిలో పంచకర్ల భూ ఆక్రమణలు, దౌర్జన్యాలకు ఆజ్యం పోశారు.

- 2014లో అధికార టీడీపీ ఎమ్మెల్యే కావడంతో నీరు–చెట్టు పేరుతో నిధులు బుక్కారు. రాంబిల్లి, యలమంచిలి ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ చేశారని అప్పట్లో స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణే ఆరోపించారు. అలాంటి వ్యక్తికే ఈ సారి పవన్ కల్యాణ్ జనసేన టికెట్ కేటాయించడంతో ప్రజలు చీదరించుకుంటున్నారు

పదేళ్ల తర్వాత మళ్లీ పెందుర్తికి పంచకర్ల

ఐదోసారి పార్టీ..మూడోసారి నియోజకవర్గం మారి పంచకర్ల తిరిగి పెందుర్తిలో వాలారు. అయితే రాజకీయ భిక్ష పెట్టిన పెందుర్తి వైపు కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో ఒక్కసారి కూడా చూడలేదు. అప్పట్లో పంచకర్ల , అనచరుల భూ దందాలను గుర్తు చేసుకుంటూ రమేష్‌బాబును నమ్మేది లేదని చెబుతున్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

- 290 కేంద్రాల్లో 150 వరకు సమస్యాత్మకంగా గుర్తించాం
- అన్ని కేంద్రాల్లో 144 సెక్షన్ అమలు
- పెందుర్తి రిటర్నింగ్ అధికారి శేష శైలజ


పెందుర్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శేష శైలజ

సాక్షి ఇంటర్వ్యూ

పెందుర్తి: ప్రచార హోరు ముగిసింది. సార్వత్రిక ఎన్నికలకు వేళయింది. అభ్యర్థులు విజయం కోసం ఆఖరి నిమిషాల్లో సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. అయితే పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు పెందుర్తి నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.శేష శైలజ చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలు జరుగుతుందని.. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిని ఉపేక్షించబోమన్నారు. వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సోమవారం పోలింగ్ నిర్వహించడమే తమ ముందున్న లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రం పెందుర్తిలో శనివారం ‘సాక్షి’ ఇంటర్వ్యూలో సోమవారం పోలింగ్ ఏర్పాట్లను ఆర్వో శేష శైలజ వెల్లడించారు.

ఎన్నికల ఏర్పాట్లు ఎలా జరిగాయి?

ఏర్పాట్లు పూర్తి చేశాం. దాదాపు అన్ని పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించాను. ఆదివారం సాయంత్రం నాటికి సిబ్బంది, ఈవీఎంలు కేంద్రాలకు చేరుకుంటాయి. ఎక్కడికక్కడ పటిష్ట ఏర్పాట్లు చేశాం. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం లేకుండా చూస్తున్నాం. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా..స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చర్యలు తీసుకున్నాం.

మొత్తం నియోజకవర్గంలో ఓటర్లు ఎంత మంది?

నియోజకవర్గంలో మొత్తం 3,075,45 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,52,592, స్త్రీలు 1,54,948 మంది, ఇతరులు ఐదుగురు ఉన్నారు. వీరిలో 6,351 మంది యువ ఓటర్లు ఉండగా..80 ఏళ్లు దాటిన వారు 3,676 మంది ఉన్నారు.

మొత్తం పోలింగ్ కేంద్రాలు ఎన్ని..సమస్యాత్మకమైనవి గుర్తించారా?

నియోజకవర్గంలో మొత్తం 290 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మరో 20 అనుబంధ పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. గత ఎన్నికల్లో జరిగిన కొన్ని ఘటనలు, ఇతరాత్ర అంశాలను పరిగణలోకి తీసుకుని వాటిలో 150 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా గుర్తించాం. అందులో తీవ్ర సమస్యాత్మకమైనవి 40 నుంచి 50 వరకు ఉన్నాయి. అన్ని కేంద్రాలపై ప్రత్యేక నిఘా నేత్రం ఉంటుంది.

శాంతిభద్రతలపై ఎలాంటి నిఘా పెట్టారు?

ఎన్నికల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. పోలింగ్ సమయంలో ఎన్నికల విధులకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దీనిపై ప్రత్యేక పోలీసు బలగాలు ఏర్పాటు చేశాం. సున్నితమైన అంశాల పట్ల అభ్యర్థులు, రాజకీయ పార్టీలు జాగ్రత్తగా వ్యవహరించాలి. పోలింగ్ సమయంలో పరిస్థితిని సమీక్షించేందుకు మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలతో పాటు అవసరమైన చోట డ్రోన్లు కూడా వాడతాం.

పోలింగ్ సమయంలో ఓటర్ల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

ఎన్నికల కమిషన్ సూచించిన ఐడీ ప్రూఫ్‌లతో ఓటు వేయవచ్చు. ఓటు వేసే సమయంలో ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే పీవోను సంప్రదిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. లేదంటే నా దృష్టికి వస్తే వెంటనే సమస్య పరిష్కరించే నెట్‌వర్క్ ఏర్పాటు చేశాం. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పిస్తాం.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పైల శ్రీనివాసరావు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ కార్యకర్తలు మైలపల్లి నాగేశ్, కొవిరి కొండబాబు, సూరాడ దేముడు, మహేష్ కుటుంబ సభ్యులకు సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బొంది మసేను, సూరాడ చినమసేను, స్పీడ్ మసేను, బొంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి రోజు అదరగొట్టారు


పరవాడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు


వాడచీపురుపల్లిలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ: సార్వత్రిక ఎన్నికల ప్రచారం పర్వానికి తెరపడింది. ఆఖరి రోజు ఆయా పార్టీల మద్దతుదారులు ప్రచారం హోరెత్తించారు. వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారంతో పాటు బైక్ ర్యాలీలతో అదరగొట్టారు.

- ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు పార్టీ కార్యకర్తలతో కలిసి పరవాడ సినిమాహాలు కూడలిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి పెందుర్తి ఎమ్మెల్యేగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్రి లక్ష్మి, బొండా శ్రీను, బద్రి, కన్నూరు దిలీప్, నాయకులు ఉన్నారు.
- వాడచీపురుపల్లిలో లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఎంపీటీసీ పుష్పాచంద్రారావు, సచివాలయ కన్వీనర్ కె.తాతాజీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీదే విజయం ..ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అన్నారు. సాలాపువానిపాలెంలో పార్టీ నాయకుడు సాలాపు సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో గండి రవికుమార్ మాట్లాడారు. అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గత ఐదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, అప్పలరాజు, నూకరాజు, రాజు, రామకృష్ణ, బాబూరావు, పరదేశి పాల్గొన్నారు.


సాలాపువానిపాలెంలో మాట్లాడుతున్న గండి రవికుమార్


మొగలిపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గండి రవికుమార్ తదితరులు

ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయండి

సబ్బవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ప్రచారం హోరెత్తించారు. పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పెందుర్తి ఎమ్మెల్యేగా అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను,అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. మొగలిపురంలో ఆ పార్టీ నాయకుడు గండి రవికుమార్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ముగ్గురి అరెస్ట్

పరవాడ: పెదముషిడివాడ గ్రామానికి చెందిన పల్లా నాగ వెంకట సూరిఅప్పారావును 45 మద్యం సీసాలతో, అదే గ్రామానికి చెందిన పిల్లా జగదీష్ నుంచి 44 మద్యం సీసాలు, లంకెలపాలెం గ్రామానికి చెందిన మునగపాక అశోక్‌కుమార్ 18 మద్యం సీసాలు తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకొన్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేశామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి


దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు


స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం : వైశాఖ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని బల్లిగిరికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ ఏడాది మొదటి ఫలం మామిడి పండ్లను భక్తులు స్వామివారికి భారీ ఎత్తున సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి వారికి వివిధ హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


చిన్నారులకు టీకాలు వేస్తున్న కొబ్బరితోట వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బంగారుమెట్ట, వెంకటేశ్వర మెట్ట–1 సచివాలయాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు, కోరింత దగ్గు, హెపటైటిస్–బి వంటి వ్యాధి నిరోధక టీకాలు వేసి, గర్భిణులకు కిల్కారీ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, ఆశ వర్కర్లు లీలావతి, అనురాధ పాల్గొని సేవలు అందించారు.

సింహగిరిపై భక్తజనం

గుమ్మడిపండు ఆకారంలో అప్పన్న దర్శనం


క్యూలో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం సెలవు కావడం, మరో పక్క తొలివిడత చందనం సమర్పణ తర్వాత గమ్మడి పండు ఆకారంలో ఉన్న వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో సింహగిరి భక్తజన సంద్రంగా మారింది. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత తొలి విడత చందనం సమర్పణ స్వామికి పూర్తి చేయడంతో శనివారం ఉదయం 9 నుంచి భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులతో దర్శనక్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, అన్నప్రసాదశాల, మాడవీధులు కిక్కిరిశాయి. ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రద్దీగా మారాయి. భక్తుల రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనాలు బంద్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రత


స్ట్రాంగ్ రూం వద్ద పహారా కాస్తున్న పోలీస్

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని ఉద్యోగులు, పోలీసులు, వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్ద నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ పత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. మూడు రోజులుగా బ్యాలెట్ ఓట్లను ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిల ఆధ్వర్యంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో ఉంచి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఆ గది వైపు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపిస్తే వెంటనే పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మాదిగల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకే..

ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు ఐడీ బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐడీ బాబు

సబ్బవరం: ఎన్నికల్లో మాదిగల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐడీ బాబు తెలిపారు. సబ్బవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మార్పీఎస్,మాదిగ దండోరా ఐక్యత కూటమి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 అసెంబ్లీ,25 పార్లమెంట్ స్థానాలకు మాదిగ జాతి సంపూర్ణ మద్దతును వైఎస్సార్‌సీపీ ఇవ్వాలని ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో తీర్మానం చేసినట్టు చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి రెండు దఫాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా మాటతప్పి మాదిగలను మోసం చేసిందన్నారు. అటువంటి వారికి వత్తాసు పలుకుతూ ప్యాకేజీల కోసం జాతిని తాకట్టు పెట్టి ఉద్యమాన్ని నీరుగార్చి కోట్లకు పడగలు ఎత్తి ఎన్‌డీఏ కూటమికి మద్దతు తెలపడం సిగ్గు చేటన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు దళితులు,గిరిజనలను చులకన చేయడం తప్పా ఒరిగిందేమీ లేదన్నారు. ఇటువంటి వారికి మాదిగల మద్దతు ఇవ్వబోమని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఇంకా ఇక్కడ ఆంధ్రా మాదిగలను శాశించాలని చూస్తే సహించేది లేదన్నారు. మందకృష్ణ మాదిగ జాతిని,ఉద్యమాన్ని తాకట్టుపెట్టి ఎన్‌డీఏ కూటమికి అమ్ముడుపోయారని ఆరోపించారు. చంద్రబాబు తన కుల అహంకారంతో దళిత జాతిలో ఎవరైనా పుట్టాలనుకొంటారా అని హేళన చేస్తే, బాబా సాహెబ్ అంబేడ్కర్ లిఖించిన రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో రద్దు చేయాలని యోచిస్తున్న బీజేపీకి మాదిగ జాతి ఈ ఎన్నికల్లో ఓటతో బుద్ధి చెబుతుందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి తమ వర్గానికి చెందిన తానేటి వనితకు రాష్ట్ర హోం మంత్రిగా, ఆదిమూలపు సురేష్‌కు మున్సిపల్ శాఖ ఇచ్చి జాతికి పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్‌సీపీ తరపున పోటీలో ఉన్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్,రాష్ట్ర నాయకుడు కొమ్ము కనకరాజు, దువ్వి దుర్గాలు, లక్ష్మణరావు,ఐగోపి,బోరా జయరాజ్, కొమ్ము కోటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


నిర్వహిస్తున్న భక్తులు


గీతాపారాయణ చేస్తున్న భక్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు లక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజనవల్లభస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి క్షీరాభిషేకం, సహస్రనామార్చన పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గీతాయజ్ఞంతో పాటు సామూహిక గీతాపారాయణ పఠించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధి చాగంటి కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎస్‌బీఐ మహిళా ఉద్యోగుల సేవా దృక్పథం


ఎస్ఎంసీ హైస్కూల్‌కు కంప్యూటర్, చైర్లు అందిస్తున్న ఎస్‌బీఐ మహిళా ఉద్యోగులు

సీతమ్మధార: ఎస్‌బీఐ మహిళా క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ఎస్ఎంసీ హైస్కూల్‌కు ఒక కంప్యూటర్, 12 చైర్లు, బుక్స్, 45 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం లాంగ్ బుక్స్‌ను సేవా దృక్పథంతో హెచ్‌ఎం డి.రాంప్రసాద్‌కు అందజేశారు. పేద పిల్లలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఉద్యోగులు తెలిపారు. క్లబ్ సభ్యులకు హెచ్‌ఎం రాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జనరల్ మేనేజర్, అమరావతి సర్కిల్ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ మంజుశర్మ, ఎస్‌బీ జోనల్ ఆఫీస్ మహిళా సిబ్బంది, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి


సమావేశంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్

తుమ్మపాల: జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 72 గంటల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాలు నిషిద్ధమన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురికి మించి ఎక్కడా గుమిగూడరాదన్నారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అర్హులైన ఓటర్లందరికీ పోలింగ్ స్టేషన్ల వద్ద సురక్షితంగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణం కల్పించామన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ఉత్తరాంధ్ర యాతల మద్దతు

తాటిచెట్లపాలెం: ఉత్తరాంధ్రలో యాతల డిమాండ్లను సాధించుకునే కార్యక్రమంలో భాగంగా తామంతా సైద్ధాంతికంగా వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు తెలిపారు. నరసింహనగర్‌లోని ఆయన నివాసంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తమ సేవా సంఘం ఆధ్వర్యంలో సాధించిన ఫలితాలను వివరించారు. సీఎంకు తెలిపిన ప్రతిపాదనల్లో సుమారు ఏడు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని 31 వేల జనాబా కలిగిన యాతలకు ఏటా రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల లబ్ధి చేకూర్చారని, వైఎస్సార్ బీమా కింద రూ.10 లక్షల మంజూరు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అభినందించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు తెలిపేలా ప్రత్యేక బ్రోచర్‌ను ఆవిష్కరించి, ఆయా జిల్లాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. సమావేశంలో రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, అసోసియేషన్ ప్రతినిధులు గొడ్డి కన్నారావు, సంపంగి మంగరాజు, బసరమాని ఈశ్వరరావు, సిమ్మా గోవింద్, దంగేటి గురుమూర్తి, కొల్లి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.